క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనర్సమ్మ

మిరుదొడ్డి(దుబ్బాక): కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ సూచించారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. 24 గంటల్లో డబ్బులు జమ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాల్ నర్సింహులు, సీసీలు బాలరాజు, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, కల్యాణి, జ్యోతి, మహేశ్, ప్రభాకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డిని పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉత్తమ విద్యబోధన అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాయక్, నాయకులు ప్రభాకర్, నర్సింహారెడ్డి, జ్యోతి, నరేందర్, సంధ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ మోసాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం అవగాహన కల్పించింది. గురువారం రాయపోల్ మండలం వడ్డేపల్లిలో ఓటుహక్కు వినియోగం, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్ గురించి ఆట, పాటలతో వివరించారు. ఈ సందర్భంగా టీమ్ లీడర్ ఆస రామారావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించామన్నారు. కార్యక్రమంలో కళాకారులు చీకోడు నర్సింహులు, బిట్ల ఎల్లం, తుమ్మల ఎల్లం, శేఖర్ తదితరులున్నారు.

ప్రజలతో ఉండే వారినే గెలిపించండి: సీపీఎం నేత



మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికలలో నిరంతరం ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలతో ఉండే సీపీఎం నాయకులనే గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అయినాపూర్‌లో ఉల్లంపల్లి సాయిలు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండలంలోని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనప్పుడు ప్రజల పక్షాన నిలబడేది సీపీఎం నాయకులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, రవీందర్, ఇస్తారి, రాజు, ఎల్లయ్య, సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

కోహెడ(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గెలుపు దిశగా కార్యకర్తలు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. 27 సర్పంచ్, 13 ఎంపీటీసీలతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. అభ్యర్థుల పేర్లను జిల్లా కమిటీకి పంపినట్లు చెప్పారు. రమేశ్, రజనీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మహాభాగ్యం

సీతాఫలం.. పోషకాలు పుష్కలం



దుబ్బాకలో సీతాఫలాల విక్రయం



- సీజన్ కావడంతో జోరుగా విక్రయాలు
- విరివిగా కొనుగోలు చేస్తున్న జనం

దుబ్బాకటౌన్: పేదోడి యాపిల్‌గా పేరుగాంచిన మధురమైన ఫలం.. సీతాఫలం. సీజన్ వచ్చిందంటే చాలు మార్కెట్లో కనువిందు చేస్తాయి. చాలా మంది ఈ పండ్లు కొనడానికి ఇష్టపడతారు. ఎక్కువ ఫైబర్, ఖనిజ లవణాలు ఉండి మంచి ఆరోగ్యాన్నిస్తాయని వైద్యులు చెప్తున్నారు.

ధర తక్కువే..

సాధారణంగా పండ్లు త్వరగా మాగేందుకు కొన్ని రసాయన మందులు వాడుతుంటారు. కానీ సీతాఫలాలకు ఎలాంటి మందులు, రసాయనాలు అవసరం లేదు. అటవీ ప్రాంతాలు, గ్రామాల్లోని గుట్టల ప్రాంతాల నుంచి ఈ పండ్లను తెచ్చి రహదారులు, బస్టాప్‌ల వద్ద ఉంచి విక్రయాలుసాగిస్తున్నారు. సైజును బట్టి ఒక్కో పండు ధర రూ.10–25కు అమ్ముతున్నారు. ఒక్కో బుట్టలో 20 పండ్లు ఉంటే దానిని రూ.200లకు విక్రయిస్తున్నారు.

పేద కుటుంబాలకు జీవనాధారం

దుబ్బాకలో 25కు పైగా కుటుంబాల వారు ఈ సీతాఫలాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. పితలవాడకు చెందిన పలు కుటుంబాలు పట్టణ శివారు ప్రాంతంలో గుడిసెల్లో నివసిస్తూ సాయంత్రం అటవీప్రాంతాలకు వెళ్లి సీతాఫలాలను తీసుకువచ్చి దుబ్బాక బస్టాండ్, తెలంగాణ తల్లి చౌరస్తా, హబ్సీపూర్ రహదారి వద్ద విక్రయిస్తున్నారు.

నెర్రలు విప్పి నోరూరించేలా..

సీతాఫలంలో అత్యధిక పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలున్నాయి. ఈ చెట్లకు ఎలాంటి తెగుళ్లు సోకవు. ఏ పురుగు పట్టదు. ఈ పంటకు పురుగు మందులు వేయాల్సిన అవసరమే లేదు. సంవత్సరం మొత్తం ఆరోగ్యంగా ఉంటూ నిండుగా పూతపూసి తియ్యని పండ్లనిస్తాయి. మార్కెట్లో ప్రస్తుతం నెర్రలు విప్పి నోరు ఊరిస్తూ ఆకర్షిస్తున్నాయి.

పోషకాలు అధికం



సీతాఫలంలో పోషకాలు అధికంగా ఉంటాయి. మాంసకృత్తులు, కాల్షియం, ఫైబర్, ఖనిజలవణాలు, విటమిన్లు వంటివి విరివిగా ఉంటాయి. శరీరానికి శక్తినిచ్చే కొవ్వు పుష్కలంగా ఉంటుంది. ఇందులో లభించే మెగ్నీషియం శరీరం పనితీరును మెరుగుపరిచి గుండె జబ్బుల నుంచి కాపాడుతుంది.

– హేమరాజ్ సింగ్, సూపరింటెండెంట్

25 ఏండ్లుగా ఇదే వృత్తి



మేము 20 సంవత్సరాలుగా సీతాఫలాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. అటవీ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి రోడ్ల పక్కన అమ్ముతుంటాను. ఎలాంటి రసాయనాలను ఇందులో వాడం. నెర్రలుబారిన పండ్లను ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు.

– లక్ష్మి, సీతాఫలాల విక్రయదారు

మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

కలెక్టర్ హైమావతి



ఆహార పదార్థాల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలను గురువారం రాత్రి ఆమె సందర్శించారు. కూరగాయల స్టోర్ రూమ్, మెనూ, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులను అడిగి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. సరైన భోజనం అందించకుంటే ఎంత మంచిగా బోధించినా శూన్యమేనన్నారు. పరిసరాలు, వంట గది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనా కేంద్రం సందర్శన



పరిశోధనా కేందారస్థానాన్ని సందర్శించిన విద్యార్థులతో శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్: తోర్నాల పరిశోధనా స్థానాన్ని సిరిసిల్ల బాబుజగ్జీవన్‌రామ్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి శాస్త్రవేత్త డా.పల్లవి డాట్ సెంటర్ లక్ష్యాలు, ఉద్దేశ్యాల గురించి వివరించారు. పరిశోధనా కేంద్రంలో వివిధ పంటలపై జరిగే పరిశోధనలు, విత్తనోత్పత్తి, వ్యవసాయ పనిముట్ల గురించి తెలియజేశారు. బీజేఆర్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ రాజు, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల నోటికాడి ముద్ద లాగేశారు

పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న సమయంలో బీఆర్ఎస్, బీజేపీలు కలిసి బీసీల నోటికాడ ముద్ద లాగేశాయని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీఓ నం. 9పై హైకోర్టు స్టే విధించడంతో బీసీలలో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. బీఆర్ఎస్, బీజేపీల అగ్రకుల నాయకల వల్లే ఈ స్టే వచ్చిందని ఆరోపించారు. ఇప్పటికైనా వివిధ పార్టీలలో కొనసాగుతున్న బీసీలు నిద్రలేచి ఆలోచించాలని అడుగేయాలని సూచించారు. బీసీలంతా ఐక్యంగా 42 శాతం రిజర్వేషన్ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలని కోరారు.

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

ఎస్‌ఐ విజయభాస్కర్



విద్యార్థులతో ఎస్‌ఐ, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ సూచించారు. మండల పరిధిలోని పెద్దకోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్, సైబర్ నేరాల గురించి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హెచ్‌ఎం యాదవరెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే కీలకం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి



మాట్లాడుతున్న లింగమూర్తి

హుస్నాబాద్: మహిళలు ఆర్థిక అభివృద్ధే కుటుంబానికి ఎంతో కీలకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో గురువారం హుస్నాబాద్ మహిళా వికాస సంఘం వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస సంస్థ వృద్ధులు, వితంతువులు, అనాథ పిల్లలకు అన్ని విధాలుగా సహకరించడం గొప్పవిషయమని కొనియాడారు. 9 రాష్ట్రాల్లో దాదాపు రెండు వేలకు పైగా వాటర్ ప్లాంట్లను నెలకొల్పి ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సంస్థ ప్రతినిధులు జ్యోతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పదిమంది బైండోవర్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసీల్దార్ శ్రీకాంత్ ఎదుట పది మంది బెల్ట్ షాపు నిర్వాహకులను గురువారం బైండోవర్ చేశారు. ఏఎస్‌ఐ శంకర్‌రావు వారిని తహసీల్దార్‌కు అప్పగించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నాగదేవత ఎక్స్ రోడ్డు ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాదర్‌పుర, నసీర్‌నగర్, ఎల్లారెడ్డినగర్, సీతారాంనగర్, గ్రీన్ కాలనీ, నాగదేవత ఎక్స్ రోడ్డు, హరీశ్‌రావు నగర్, గాడిచర్లపల్లి, రెడ్డికాలనీ, ఇస్లామియా కళాశాల ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభిస్తున్నట్టు ఐకేపీ ఏపీఎం బాబురావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఎంసీలో ఉదయం 11 గంటలకు, చందాపూర్‌లో 11.20ని.లకు, జప్తిలింగారెడ్డిపల్లిలో 11.50ని.లకు, వెంకట్రావుపేటలో 12.20 ని.లకు లింగాపూర్‌లో ఒంటి గంటకు, బంజేరుపల్లిలో 1.30ని.లకు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో రాజేశం రచనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైసూర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఇండియన్ లాంగ్వేజ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరతవాని ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేటకు చెందిన బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం రచనలు ఆన్‌లైన్‌లో ప్రదర్శిస్తున్నారు. పసిడి వెన్నెల, బాలకథా మంజూష, బాలకథా కౌముది, బాలకథా దీపిక పుస్తకాలలోని కథలు ఆన్‌లైన్‌లో ఆడియో రూపంలో ఉంచారు. దీంతో భరతవాని ప్రాజెక్ట్ నిర్వాహకులకు రాజేశం కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా యాగశాల ప్రవేశం

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న కత్తి కార్తీక

దుబ్బాక: పట్టణంలో బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం యాగశాల ప్రవేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, మూల మంత్ర హవనం, మంత్ర పుష్పం లాంటి కార్యక్రమాలు జరిపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక బొడ్రాయికి జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకొన్నారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

అసోసియేషన్ రాష్ట్ర నేత భిక్షపతి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జోగు భిక్షపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీవిరమణ పొందిన పెన్షనర్లకు రావలసిన పెన్షన్ బెనిఫిట్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. రూ.398 స్థిర మాస వేతనంతో పనిచేసిన ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు పనిచేయక పోవడంతో వయోవృద్ధులైన పెన్షనర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి కోసం నగదురహిత వైద్య సేవలందించాలని చెప్పారు. సమస్యలను పరిష్కరించుకొనేందుకు పెన్షనర్స్ డైరెక్టర్‌ను ఏర్పాటు చేయాలని, 20 యేళ్ల పూర్తిచేసి పదవీవిరమణ పొందిన వారందరికీ పెన్షన్ పొందే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, సత్తయ్య, ఇంద్రసేనారెడ్డి, నాగేందర్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పరశురాములు, బాల నరసయ్య, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారం అవసరం

ఎస్‌ఐ రాజేశ్



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ

సిద్దిపేటరూరల్: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలను అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని ఎస్‌ఐ రాజేశ్ అన్నారు. మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో నార్కోటిక్ డాగ్స్‌తో కిరాణా షాపులు, హోటళ్లు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనలో ఏవైనా మార్పులు ఉంటే తల్లిదండ్రులు గమనించి వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, యాంటీ నార్కొటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారితో అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): మండల కేంద్రమైన ములుగుకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి తెలిపారు. ములుగులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, కనుకయ్య, శ్రీనివాస్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దూల్మిట్ట మండలంలో..

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని హనుమతండా మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇస్లావత్ రమేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను నిరసిస్తూ తలపెట్టిన బస్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకొనేందుకు పలుచోట్ల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.



బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/నంగునూరు(సిద్దిపేట): బెజ్జంకి ఏఎస్‌ఐ శంకర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, ఫాక్స్ వైస్ చైర్మన్ రమేశ్, నరేశ్, అజయ్ తదితరులున్నారు. అలాగే సిద్దిపేట వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నంగునూరులో రాజగోపాల్‌పేట పోలీసులు మాజీ ఎంపీటీసీ బాబు, రాము, పరశురాములు, అనిల్‌రెడ్డి, చింటు, ఇమ్రాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఏసీపీ నర్సింహులు



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఏసీపీ

తొగుట(దుబ్బాక): స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు. నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు మరో ఇద్దరికి మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ లతీఫ్, ఎస్‌ఐ రవికాంత్ రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హామీలు అమలు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం మాట తప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జూలై 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

◆ పౌష్టికాహారంపై అవగాహన అవసరం

మద్దూరు(హుస్నాబాద్): పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సీడీపీఓ రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవల గురించి వివరించారు.

◆ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల బాకీ తీర్చాలి

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల బాకీని తీర్చాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ హామీల బాకీ కార్డులను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా అమలు చేయలేదన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు లకావత్ మానస, భూక్య మంగ, మాలోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ఏకాగ్రతతోనే లక్ష్య సాధన సాధ్యం

గజ్వేల్‌రూరల్: ఒత్తిళ్లను అధిగమించి ఏకాగ్రతతో ఉన్నప్పుడే లక్ష్యాన్ని చేరుకోవచ్చని లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ కుమారస్వామి అన్నారు. బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్య వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు డాక్టర్ నిఖత్ అంజుమ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. క్లబ్ సభ్యులు మురళి, అధ్యాపకులు డాక్టర్ అలివేలు, డాక్టర్ మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ముగిసిన కౌన్సెలింగ్

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఈఏపీసెట్ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసిందని ప్రిన్సిపాల్, హెల్ప్ లైన్ సమన్వయకర్త గోవర్ధన్ తెలిపారు.